

సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



పులి అవునా.. కాదా!

రాజమహేంద్రవరం నగర శివారు ప్రాంతంలో సంచరిస్తున్నది చిరుతపులి అవునా.. కాదా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

II లో



ఏమైందో ఏమో..

తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయతీ శివారు అడవిపూడి గ్రామంలో శుక్రవారం ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా మృతి చెందారు.

గణనాయకా.. భజేహం



గణనాయకా.. భజేహం అంటూ ఆ వినాయక స్వామిని మనసారా కొలిచే వేడుక రానే వచ్చింది.. వినాయక చవితి ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. 15వ తేదీ వరకూ నవరాత్ర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

II లో

న్యూస్‌రీల్

మట్టి గణపతి ప్రతిమలతో పర్యావరణ రక్షణ



ప్రశాంతి, కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ: మట్టి గణపతి విగ్రహాలకు మాత్రమే పూజలు చేసి, పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. వినాయక చవితి పండుగ జరుపుకొనే విధానంలో ప్రకృతిలో సహజంగా లభించే వాటితోనే పూజలు చేయడం ఆచారంగా వస్తోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర నీటిలో కరగని వాటిని ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలను పూజలలో వినియోగించవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు, సాధారణ ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా జిల్లా, పోలీసు యంత్రాంగం సూచనలను పాటించాలన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా చవితి వేడుకలు



నరసింహ కిశోర్, ఎస్పీ

కంబాలచెరువు: వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ నరసింహ కిశోర్ సూచించారు. పోలీసులకు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు సహకరించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకుగాను మట్టితో చేసిన ప్రతిమలను పూజించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీసులకు చవితి శుభాకాంక్షలు తెలిపారు.

హర్షకుమార్‌పై బైండోవర్ కేసు

రాజమహేంద్రవరం రూరల్: మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌పై బొమ్మూరు పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. మాజీ ఎంపీ హర్షకుమార్ శుక్రవారం ద్వారంపూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఘటనకు సంబంధించి బాధితులను పరామర్శించేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. జేఎన్‌రోడ్డు శివారు జాతీయ రహదారిపైకి వచ్చే సరికి ఆయన వాహనాన్ని సెంట్రల్‌జోన్ ట్రాఫిక్ డీఎస్పీలు రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, బొమ్మూరు, ప్రకాష్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో అడ్డుకున్నారు. హర్షకుమార్‌ను ద్వారపూడి వెళ్లవద్దని చెప్పారు. తిరిగి ఇంటికి వెళ్లిపోవాలని తెలిపారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యునిగా చేసిన తనను నిర్బంధించడం సరికాదన్నారు. అనంతరం ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు హర్షకుమార్‌ను ఆయన కారులోనే ఇంటికి తీసుకువెళ్లారు.

మరో ఆరుమాసాలు వేచి చూద్దాం

టీడీపీ వైఖరిపై జనసేన నేత

నల్లజర్ల: టీడీపీ నేతలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మమ్మల్ని వాడుకున్నారు. తీరా అధికారం చేపట్టాక పట్టించుకోవడం మానేశారు. ఏ గ్రామం వెళ్లినా తమకు సమాచారం ఉండటం లేదని జనసేన నాయకులు, కార్యకర్తలు వాపోయారు. ఆవపాడులో శుక్రవారం గోపాలపురం నియోజకవర్గం జనసేన కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో దేవరపల్లి మండలానికి చెందిన అనిశెట్టి గంగరాజు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వెంకట్రాజు వివిధ గ్రామాలకు వచ్చే సందర్భాలలో కనీసం మాట మాత్రంగానైనా తమను పిలవడం లేదని అధికారం వచ్చిన మూడు మాసాలలోనే ఇలా ఉంటే ముందు ఎలా ఉంటుందో అన్నారు. దీనిపై నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ కొన్ని సందర్భాలలో కార్యక్రమాలు తెలిసి జరుగుతున్నాయి. కొన్ని తెలియకుండానే జరిగిపోతున్నాయని ఈ విషయాలను అధిష్టానం దృష్టికి తీసుకువెళదామన్నారు. ఆరు మాసాలు ఓపిక పట్టండి..అప్పటికీ మార్పు రాకపోతే ఏం చేయాలో ఆలోచిద్దామని కార్యకర్తలను సముదాయించారు.

తీరంలో 'అల'జడి



ఉప్పాడ తీర ప్రాంతంలో ఎగసి పడుతున్న అలలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర తీరంలో అలలు ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ తీర ప్రాంతంలో ఒక్కసారిగా సముద్రపు అలలు ఎగసి పడడంతో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. బీచ్‌రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్లగోడను సైతం దాటుకుని అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో బీచ్‌రోడ్డులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎగసి పడుతున్న అలలు ప్రయాణికులపై పడుతున్నాయి. అలల కారణంగా తీరప్రాంతంలో మత్స్యకారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు. చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్

ముగింపు పలికేద్దాం

- వంట కాలువలపై ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ
- 18 నాటికి పంట నష్టం అంచనాలు
- వేతనాల కోసం సభ్యుల పట్టు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన శుక్రవారం కాకినాడలో జరిగిన జెడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు. వ్యవసాయం, నీటిపారుదల, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, డీఆర్‌డీఏ తదితర శాఖల వారీగా సమీక్షించారు. ప్రస్తుతం వర్షాలతో వ్యవసాయానికి జరిగిన నష్టం, నీటిపారుదల శాఖ పరిధిలో సాగు నీటి సరఫరా, పంటల పరిస్థితిపై సభ్యుల సందేహాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయకుమార్ నివృత్తి చేశారు.

కాలువల ఆధునీకరణ దిశగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏటా పంటలకు ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా పంట కాలువలపై ఆక్రమణలను తొలగించి ఆధునీకరించే దిశగా కార్యాచరణ రూపకల్పనకు సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది. ఇటీవల భారీ వర్షాలతో ముంపునకు గురైన పంట నష్టాలపై సర్వేను ఈ నెల 10న చేపట్టి 18 నాటికి ప్రభుత్వానికి నివేదించనున్నామని జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ సభ్యులకు తెలియజేశారు. నాట్లు వేసిన 40 రోజులు దాటిన పంటలన్నింటికీ ఇన్ పుట్ సబ్సిడీ అందుతుందన్నారు. ఈ క్రాప్ బుకింగ్ కోసం ఇప్పటి వరకూ 30 శాతం ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని జేడీ వివరించారు. మిగిలిన నమోదు ప్రక్రియ ఈ నెల 15 నాటికి పూర్తి చేసేందుకు సహకారం అందించాలని సభ్యులను కోరారు. గోదావరి బ్యారేజీ, ఏలేరు రిజర్వాయర్లలో నీటి స్థాయి, దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణాలను ఇరిగేషన్ ఎస్ఈ బి.శ్రీనివాసరావు వివరించారు. ఏలేరు వ్యవస్థలో బలహీనంగా ఉన్న గట్ల పటిష్టకు రూ.కోటితో పనులు చేపడుతున్నామని, ఏలేరు సాగునీటి వ్యవస్థ ఆధునీకరణకు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నామని కలెక్టర్ షణ్మోహన్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సాగునీటి వ్యవస్థ ఆధునీకరణ పనుల ప్రతిపాదనల్లో ఎమ్మెల్యేల సూచనలను పరిగణలోకి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు ఎమ్మెల్యేలు కోరారు. సాగు నీటి కాలువలు, డ్రెయిన్లపై ఆక్రమణ వల్లే ముంపు సమస్య ఎదురవుతోందని కొందరు ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారంపై చర్చించారు. ప్రస్తుతం వర్షాలు, ముంపు పరిస్థితులతో అంటువ్యాధులు ప్రబలకుండా చేపట్టిన కార్యాచరణను డీఎంహెచ్ఓ నరశింహనాయక్ వివరించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పన, సిబ్బంది, వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు కోరారు. డీఆర్‌డీఏపై పలు అంశాలు చర్చించారు. పంచాయతీ రాజ్ సమీక్షలో గ్రామాల్లో అంతర్గత రోడ్ల గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా చేపట్టాలని సభ్యులు కోరారు. కాకినాడ రూరల్‌లో పరిశ్రమల నుంచి వస్తోన్న కాలుష్యంపై పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

వేతనాలు జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు తీర్మానం

పెండింగ్‌లో ఉన్న వేతనాలపై జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు ప్రస్తావించారు. దూర ప్రాంత మండలాల నుంచి సొంత ఖర్చులతో సమావేశాలకు హాజరవుతున్నామని, గౌరవ వేతనాల చెల్లింపుపై జెడ్పీ సీఈఓ స్పష్టమైన ప్రకటన చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. సభ్యుల గౌరవం వేతనాల గ్రాంట్ విడుదలైందని, ట్రెజరీలో బిల్లు పెట్టామని జెడ్పీ సీఈఓ శ్రీరామ చంద్రమూర్తి స్పష్టం చేశారు. నిధులు విడుదలైతే బిల్లు క్లియర్ అవుతుందని సీఎఫ్ఎంఎస్‌లో వస్తోందని, అందువల్లే చెల్లింపులు జాప్యం అవుతున్నాయని వివరణ ఇచ్చారు. గౌరవ వేతనాలు ఆలస్యం లేకుండా సభ తీర్మానం ద్వారా జెడ్పీ జనరల్ ఫండ్ నుంచి చెల్లించాలని రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్ సూచించారు. ఇందుకు వారం రోజులు గడువు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి సభ్యులకు సూచించారు. సంతృప్తి చెందని సభ్యులు వాక్ అవుట్ చేసేందుకు సిద్ధం కాగా ఎమ్మెల్యేలు సముదాయించారు. జిల్లా కలెక్టర్ సమస్య పరిష్కారానికి అడిగిన గడువు వారం రోజులు వేచి చూడాలన్నారు. ప్రజలు తుపానులు, ముంపు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారి సమస్యల పరిష్కారం గురించి చర్చించకుండా, తమ గౌరవ వేతనాల కోసం సభ నుంచి వాక్ అవుట్ చేయడం సరికాదని ఎమ్మెల్యేలు సూచించారు. గౌరవ వేతనాలను జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు చైర్మన్ వేణుగోపాలరావు ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. సమావేశంలో తూర్పుగోదావరి జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదిశంకర మార్గ్‌లో డ్రెయిన్‌పై పడ్డ బండరాయి



ఆదిశంకరమార్గ్ రోడ్డు డ్రెయిన్‌పై పడిన బండరాయి

- వాహనదారులకు త్రుటిలో తప్పిన ప్రమాదం
- ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలుపుదల


అన్నవరం: రత్నగిరి పై గల ఆదిశంకర మార్గ్ రోడ్డుకు కుడివైపున గల కొండ మీద నుంచి శుక్రవారం రాత్రి పెద్ద బండరాయి విరిగి పడింది. ఆ బండరాయి కొండ పక్కనే గల డ్రెయిన్ మీద పడ్డంతో ఎటూ దొర్లడానికి అవకాశం లేక అలా ఉండిపోయింది. దీంతో ఆ రోడ్డు వెంబడి వాహనాలలో ప్రయాణించే భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అదే ఆ బండరాయి రోడ్డు మీద పడుంటే రోడ్డు మీద ప్రయాణించే వాహనాలు ఆ రాయిని ఢీకొట్టే అవకాశం ఉండేది. ముందు జాగ్రత్త చర్య గా ఆదిశంకర మార్గ్ రోడ్డు పై వాహనాలు, ప్రయాణాలను నిలిపివేశారు. వర్షాలు తగ్గాక ఆదిశంకర మార్గ్ పరిశీలించి వాహనాల రాకపోకలపై నిర్ణయం తీసుకుంటారని అధికారులు తెలిపారు.

ఘాట్‌రోడ్లలో రక్షణ ఏర్పాట్లు చేయాలి

రత్నగిరి రెండు ఘాట్‌రోడ్లు, ఆదిశంకరమార్గ్, సత్యగిరి రోడ్డు, వనదుర్గ గుడివైపు రోడ్డు, పార్కింగ్ కోసం చదును చేసిన సత్యగిరి రోడ్డు పక్కన స్థలంలో ఈ విధంగా కొండ చరియలు విరిగి పడే అవకాశం ఉన్నందున అధికారులు తగు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ కొండల నుంచి రాళ్లు జారిపడకుండా ఇనుప వైర్లతో కొండలను ఆనుకుని చిక్కాలు ఏర్పాటు చేసే ప్రతిపాదనను 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ పరిశీలించారు. నిపుణులు కూడా దేవస్థానానికి విచ్చేసి ఆ పనులపై అధికారులకు వివరించారు. ఇప్పుడు ఆ నిపుణులతో మళ్లీ మాట్లాడి రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

శాంతిస్తున్న వరద గోదావరి

ఎగువన తగ్గుముఖం పట్టిన నీటి మట్టాలు



కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: వరద గోదావరి తగ్గుతోంది. గురువారం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరిన గోదావరి శుక్రవారం ఉదయం మరింత పెరిగింది. అనంతరం మధ్యాహ్నం నుంచి క్రమేపీ తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం నాటికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద శుక్రవారం ఉదయం 12.30 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ రాత్రి 8గంటలకు 12అడుగులకు చేరింది. కాటన్ బ్యారేజీ నుంచి 10,36,440 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. డెల్టా కాలువలకు సంబంధించి 2,300 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో శనివారం ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 8.40 మీటర్లు, పేరూరులో 13.75 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.45 మీటర్లు, భద్రాచలంలో 41.70 అడుగులు, కూనవరంలో 18.69 మీటర్లు, కుంటలో 10.25 మీటర్లు, పోలవరంలో 12.39 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.12 మీటర్ల వద్ద నీటి మట్టాలు నెలకొన్నాయి.

కలి కలహ స్వరూపుడు



సామవేదం షణ్ముఖశర్మ

రాజమహేంద్రవరం రూరల్: కలి కలహ స్వరూపుడు, పరస్పర కలహాలు, వైషమ్యాలు కలగజేస్తాడని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. కొంతమూరులోని శ్రీవల్లభగణపతి ఆలయ ప్రాంగణంలోని ప్రవచన మందిరంలో ఆయన రెండవ రోజు కల్కి అవతార వైభవం గురించి ప్రవచనాన్ని కొనసాగించారు. అరిషడ్వర్గాల కలయికే కలి, కలి దోషం ప్రబలినప్పుడు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని ఆయన అన్నారు. సనాతన ధర్మానికి గ్లాని ఏర్పడినప్పుడు కొంతమంది మహాత్ములు అవతరిస్తారని భవిష్య పురాణం సూచించిందని, రాణాప్రతాప్, శివాజీ, అహల్యాబాయి వంటి వారు భగవద్విభూతి కలవారేనని సామవేదం అన్నారు. ఊరు నిండా, మార్గమంతటా ముళ్లు ఉన్నా, కాళ్లకు చెప్పులు ఉంటే, ఆ ముళ్లు బాధించవు. కలిదోషం ప్రబలిపోతున్నా, భగవంతుని స్మరించడం మానకపోతే కలి లక్షణాలు మనలను బాధించవు. యుగభేదాన్ని పురాణాలు వివరించాయి. భారతంలో భీముడు ద్రౌపది కోర్కె తీర్చడానికి సౌగంధిక పుష్పాన్ని తేవడానికి వెడుతూంటే, హనుమంతుడు కనపడతాడు. యుగ భేదాన్ని, యుగ పరివర్తనను ఆయన భీమసేనునికి వివరించాడని సామవేదం తెలిపారు. భారతంలోఈ సన్నివేశాన్ని అధ్యయనం చేస్తే, నాలుగు యుగాలపై మనకు అవగాహన ఏర్పడుతుందని సామవేదం తెలిపారు. అనుష్ఠానం అంటే కేవలం మంత్రానుష్ఠానం మాత్రమే కాదు, ధర్మానుష్ఠానం కూడా, రెంటినీ విడదీయరాదు. సకాలంలో చేసిన కర్మానుష్ఠానమే పూర్తి ఫలితాన్ని ఇస్తుంది, ఆపత్కాలంలో మినహాయింపు ఉంటుందని, ప్రతిరోజు సంధ్యావందనం సకాలంలో చెయ్యాలని అన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు చేస్తే పూర్తి ప్రయోజనం ఉండదన్నారు. 70 సంవత్సరాలు వచ్చాక, వివాహం జరిగితే ఏమి ప్రయోజనం ఉంటుంది? అని ఆయన అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

నిండా ముంచిన నది

- గోదావరి లంకల్లో వరద నీరు
- నీట మునిగిన బోడసకుర్రు పల్లిపాలెం
- పొంగి పొర్లుతున్న డ్రైన్లు

సాక్షి, అమలాపురం: వరద అంతకంతకూ పెరుగుతోంది.. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం వరకూ పెరిగిన వరద తరువాత నుంచి నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది. కానీ దిగువనున్న కోనసీమ జిల్లాలో మాత్రం వరద ప్రవాహం పెరుగుతోంది. బ్యారేజీ వద్ద వరద తగ్గుతున్నా ఆ ప్రభావం జిల్లాలోని శివారు ప్రాంతాల్లో ఎనిమిది నుంచి పది గంటల తరువాత కాని కనిపించదు. ఈ కారణంగా శుక్రవారం అర్ధరాత్రి వరకూ జిల్లాలోని లంక గ్రామాల్లో వరద పెరిగింది. దీనివల్ల పలు లంక గ్రామాలు ముంపుబారిన చిక్కుకున్నాయి.

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం తొమ్మిది గంటలకు 10,55,223 క్యూసెక్కులు ఉన్న వరద ప్రవాహం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో 10,63,085 క్యూసెక్కులకు పెరిగింది. తరువాత తగ్గడం ఆరంభమైన వరద సాయంత్రం ఆరు గంటల సమయంలో 10,36,440 క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజీ వద్ద వరద తగ్గినా, జిల్లాలో ఆ ప్రభావం శనివారం ఉదయం నుంచి తగ్గనుంది. ప్రస్తుతానికి లంక గ్రామాల్లో వరద పెరుగుతూనే ఉంది. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లెపాలెంలో వరద నీరు చేరింది. ఇళ్ల వద్దకు నీరు రావడంతో ఇక్కడ నివాసముండే మత్స్యకారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్థానికంగా బోడసకుర్రు–పాశర్లపూడి వంతెనను ఆనుకుని సుమారు 45 ఇళ్లలో సుమారు 80 కుటుంబాల వారు నివాసముంటున్నారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే చాలు ఇక్కడ మత్స్యకార ఇళ్లు నీట మునుగుతుంటాయి. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వే నీట మునిగింది. స్థానికులు ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం పరిధిలో అద్దంకివారిలంక గ్రామాలకు వెళ్లేవారు కాజ్‌వేపై ట్రాక్టర్లపై వెళ్తున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై నీరు చేరింది. దీనితో రాకపోకలు నిలిపివేశారు. బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంక వాసులు మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి ఉచ్చిలవారిపేటకు వెళ్లే మార్గం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ గ్రామంలో కొబ్బరి తోటలోకి వరద నీరు చేరింది. స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో సొంత వాహనాలపై వెళ్తున్నారు.

పి.గన్నవరం మండలంలో వరద ఉధృతి అధికంగా ఉంది. అక్విడెక్టు వద్ద వరద మరింత పెరిగింది. గంటి పెదపూడిలంక, ఊడిమూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు, పశ్చిమ గోదావరి జిల్లా పరిధి కనకాయిలంక, అయోధ్యలంక, అనగారిలంక, శిర్రావారిలంక గ్రామాలకు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తగా ఇదే మండలంలో మానేపల్లి శివారు శివాయిలంకలోకి వరద నీరు చేరింది. ప్రధాన రోడ్డుపైకి నీరు రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వారు ట్రాక్టర్లపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ముమ్మిడివరం మండలం గురజాపులంకకు వెళ్లే సిమెంట్ రోడ్డుపై కూనాలంక నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కూనలంక తదితర లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించింది. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా ప్రాంత వాసుల రాకపోకలకు మెకనైజ్డ్ బోట్లు ఏర్పాటు చేశారు. గోదావరి నదీపాయల్లో వేటకు వెళ్లవద్దని స్థానిక మత్స్యకారులను అధికారులు ఆదేశించారు.

నీట మునిగిన వరిచేలు

ముమ్మిడివరం మండలం అయినాపురంలో సుమారు 400 ఎకరాల వరిచేలు నీట మునిగాయి. వీటితోపాటు కొత్తలంకలో 200 ఎకరాలు, సోమిదేవరపాలెం 200 ఎకరాలు, సీహెచ్ గున్నేపల్లి, అనాతవరం గ్రామాల్లో మురుగు కాలువల వెంబడి ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. గోదావరి వరద నీరు రావడంతో అవుట్‌పాల్ స్లూయిజ్ తలుపులు మూసివేశారు. బొబ్బర్లంక- పల్లంకుర్రు ప్రధాన పంట కాలువపై అయినాపురం మురుగు కాలవ వద్ద ఉన్న సర్‌ప్లస్ వియర్ నుంచి లీకు అవుతూ వస్తున్న వృథా నీరు, వర్షాలతో డ్రైన్లలో ముంపు నీరు దిగడం లేదు. దీంతో డ్రైన్ తన్ని పెట్టి చేలల్లో ముంపునీరు ఉండిపోతోంది. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటే ఆ వరి పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదలతో జిల్లాలో పలు మురుగునీటి కాలువల నీరు నదిలోకి దిగే అవకాశం లేదు.



పి.గన్నవరం మండలం శివాయలంకకు వెళ్లే రహదారి వరదనీట మునగడంతో ట్రాక్టర్‌పై వస్తున్న ప్రజలు



పి.గన్నవరం బూరుగులంక రేవులో పడవ దాటుతున్న విద్యార్థులు



ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడియం వద్ద కాజ్‌వేపై వరదనీరు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముమ్మిడివరం: విధులు ముగించుకుని అమలాపురం నుంచి మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం టీడీపీ కార్యాలయం సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. కాకినాడకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు సీహెచ్ ఎంసీ సత్యనారాయణ, పి.మణికంఠ కుమార్‌లు విధులు ముగించుకుని పల్సర్ బైక్‌పై కాకినాడ వెళ్తుండగా ఎదురుగా యానం నుంచి అమలాపురానికి మోటారు సైకిల్‌పై వస్తున్న మామిడికుదురుకు చెందిన కుంచే ప్రశాంతకుమార్, అతని స్నేహితుడు ఏలూరుకు చెందిన పెరుమళ్ల విజయ్‌లు ఢీకొన్నారు. గాయపడిన కానిస్టేబుళ్లను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి, మరో ఇద్దరిని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు ఎస్సై జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు

మామిడికుదురు: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారంటూ నగరం గ్రామంలో నివాసం ఉంటున్న చిలకపాటి రేణుక ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ శుక్రవారం తెలిపారు. భర్త చిలకపాటి భానుప్రసాద్, మామ సత్యనారాయణ, అత్త మణికుమారితో పాటు మరో ఏడుగురు కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన రేణుకను అదే గ్రామానికి చెందిన భానుప్రసాద్ 2021లో ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. ఈ పెళ్లి ఇష్టం లేని భానుప్రసాద్ తల్లి, తండ్రి వారి కుటుంబ సభ్యులు మొత్తం పది మంది రూ.10 లక్షల అదనపు కట్నం తీసుకురమ్మని రేణుకను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కిర్లంపూడి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో ద్వారం రవిప్రసాద్ (ఏ1)కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2023లో సోమవరం, శృంగరాయునిపాలెం, వీరవరం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై కేసు నమోదైంది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ద్వారం రవిప్రసాద్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో రవిప్రసాద్‌కు ఏడాది జైలు, మరో ఇద్దరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు.

గణనాయకా.. భజేహం

- చవితి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు
- నేటి నుంచి 15వ తేదీ వరకూ నవరాత్రులు
- ఆలయాలకు వేలాదిగా తరలిరానున్న భక్తులు

సాక్షి, అమలాపురం/ అయినవిల్లి: గణనాయకా.. భజేహం అంటూ ఆ వినాయక స్వామిని మనసారా కొలిచే వేడుక రానే వచ్చింది.. వినాయక చవితి ఉత్సవాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం వినాయక చవితి కాగా, 15 వరకూ నవరాత్ర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లి సిద్ధి వినాయక స్వామివారి ఆలయం, తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి స్వామివారి ఆలయం, కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ప్రధానంగా ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర ఆలయం చవితి మహోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వరస్వామిని దర్శించుకోవడానికి దేశ వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. దీనికి తగ్గట్టుగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. అయినవిల్లి ఎస్సై కె.మనోహర్‌జోషి ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

పండగ రోజు ప్రత్యేక అభిషేకాలు

అయినవిల్లిలో వినాయక చవితి సందర్భంగా స్వామివారికి బత్తాయి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, మామిడి వంటి వివిధ పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. దీనికి గాను అన్ని ఏర్పాటు చేశారు. అనంతరం లక్షగరిక పూజ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, హారతులు తదితర కార్యక్రమాలు తొమ్మిది రోజుల పాటు ఉంటాయని ఏసీ తెలిపారు. ఆయా రోజుల్లో ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిస్తారు. చవితి రోజున సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా. లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణం వెలుపల మండపంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుపుతారు.

ఉత్సవాల్లో ఇలా..

వినాయక నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయాన్ని ప్రతి రోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు తెరుస్తారు. తొలుత మేలుకొలుపు సేవ చేస్తారు. ఐదు గంటల నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు నిత్య గణపతి హోమం, ఒంటి గంటకు ప్రత్యేక అలంకరణ, ప్రసాద నివేదన ఉంటాయి. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని మూషిక వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంచ హారతులు ఇస్తారు. రాత్రి ఏడున్నర వరకూ ఆలయం తెరిచి ఉంటుంది.



వివిధ పుష్పాలతో అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయంలో ముస్తాబు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అన్ని ఏర్పాట్లూ చేశాం..



అయినవిల్లి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. చవితి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం. నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

–ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్, అయినవిల్లి

సందడే... సందడి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఇంచుమించు వీధి వీధికీ.. పల్లెల్లో వాడవాడలా వినాయక పందిళ్లు వెలిశాయి. ఆయా నిర్వాహకులు గణనాథుల ప్రతిమలను కొనుగోలు చేసి తరలించారు. గణనాథులు, పూజ సామగ్రి కొనుగోళ్లతో శుక్రవారం మార్కెట్లో సందడి నెలకొంది. కోనసీమలో అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీతో పాటు, తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, రాజానగరం, కొవ్వూరు, కాకినాడ జిల్లాలో కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని తదితర చోట్ల సందడి నెలకొంది. వినాయక ప్రతిమలు, పత్రి, పువ్వులు, పండ్ల అమ్మకాలతో వ్యాపారులు, కొనుగోలుదారులతో సందడిగా మారాయి. ఈ ఏడాది వేలాది మండపాల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. వివిధ రకాల నమూనాల్లో సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. వాటి మధ్య పలు రకాల ఆకృతుల్లో గణనాథులు కొలువుదీరనున్నారు. మండపాల్లో పది నుంచి ఇరవై అడుగుల ఎత్తున విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈసారి పర్యావరణానికి పెద్దపీట వేస్తూ ఉత్సవ కమిటీలు మట్టి గణనాథులనే ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

కొండెక్కిన పూజా సామగ్రి

పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. కేవలం యాపిల్, దానిమ్మ ఒక్కదాని ధర రూ.30 నుంచి రూ.35 వరకూ ఉంది. బత్తాయి, నారింజ ఒక్కటి రూ.20, మూడు మొక్కజొన్న పొత్తులు కలిపి రూ.వంద చొప్పున విక్రయించారు. ఫలాలతో పాటు పువ్వుల ధరలు సైతం భారీగా పెరిగాయి. బంతి, చామంతి, గులాబీల ధర కిలో రూ.400 నుంచి రూ.500 వరకూ పలుకుతున్నాయి. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు సైతం అధికంగా ఉండడంతో సామాన్యులకు పండగ సందడి అంతంతగానే ఉంది.



మండపేటలో కొనుగోలుదారులతో కళకళలాడుతున్న మార్కెట్

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థుల మృతి
- దివాన్‌చెరువులో సంఘటన



ప్రవీణ్‌కుమార్



కార్తీక్

రాజానగరం: వేగంగా వచ్చిన ఓ లారీ ఇద్దరు విద్యార్థుల ప్రాణాలను బలిగొంది. రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు పెట్రోల్ బంకు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన రోణంకి ప్రవీణ్‌కుమార్ (20), పల్నాడు జిల్లాకు చెందిన చింతా కార్తీక్ (19) రాజానగరం గైట్ కాలేజీలో చదువుతూ, కాలేజీ ఎదురుగా ఉన్న బ్రిడ్జి కౌంటీలో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్‌కుమార్‌కు ఆరోగ్యం బాగోక పోవడంతో గురువారం రాత్రి కార్తీక్ అతనిని తీసుకుని బైకుపై రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి బయలుదేరాడు. ఈ క్రమంలో దివాన్‌చెరువు సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న బైకును వెనుక నుంచి అతి వేగంగా దూసుకు వచ్చిన లారీ ఢీకొంది. ఢీకొట్టిన లారీ వారిని కొంతదూరం ఈడ్చుకుంటూ పోయింది. దీంతో వారిద్దరిలో ఒక విద్యార్థి శరీర భాగాలు విడిపోయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడి, చూపరులను సైతం కలచివేశాయి. దీంతో ఆ ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలానికి బొమ్మూరు పోలీసులు చేరుకుని, ఆ విద్యార్థులను సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించారు. ప్రమాద సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం గైట్ కళాశాల వద్ద మృతులకు తోటి విద్యార్థులు నివాళులు అర్పించారు. కేసును బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పులి అవునా.. కాదా!

- లాలాచెరువు ప్రాంతంలో సంచరిస్తున్నట్లు ప్రచారం
- దర్యాప్తు ప్రారంభించిన అటవీ శాఖ



అటవీ శాఖ అధికారుల కంటపడిన ఓ జంతువు కాలి గుర్తు



2011లో అటవీ శాఖ అధికారులు బంధించిన పులి



ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం నగర శివారు ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు పలువురు చెబుతుండటం ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ పుష్కరవనం మధ్య పులి ఓ జంతువును నోట కరుచుకుని రోడ్డు దాటి ఫారెస్ట్ క్వార్టర్స్ వైపు వెళ్లిందని వాహనచోదకుల్లో కొందరు చెబుతుండటంతో కచ్చితంగా అక్కడ చిరుతపులి సంచరిస్తున్నట్టు స్థానికులు నిర్ధారణకు వచ్చి భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై ఫారెస్ట్ అధికారులను వివరణ కోరగా అటవీ ప్రాంతాన్ని పోలిఉన్న అక్కడ పెద్దగా కనబడే బావురు పిల్లులు తిరుగుతున్నాయని, వాటిని చూసి కూడా పులిగా భ్రమపడే అవకాశం ఉందని, అలాఅని చిరుత పులి సంచారం వదంతులుగా కొట్టి పారేయలేమన్నారు. అటవీ ప్రాంతం దగ్గరగా ఉన్న రాజమహేంద్రవరం నగరానికి చిరుత పులులు దారితప్పి వచ్చే అవకాశం ఉందన్నారు. నిజ నిర్ధారణ మొదలు పెట్టిన అటవీ అధికారులు గురువారం అర్ధరాత్రి చిరుతపులి సంచారాన్ని ప్రత్యక్షంగా చూశామని చెబుతున్న వారి నుంచి వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర దర్యాప్తు మొదలు పెట్టారు. పులి ఓ జంతువును నోట కరుచుకుని వెళ్లినట్టుగా చెబుతున్న ప్రాంతంలో పాద ముద్రలు తప్పనిసరిగా పడతాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా నేల బురదగా ఉండటంతో పులి సంచరిస్తే కాలి ముద్రలు దొరుకుతాయని అధికారులు అంటున్నారు.

నగరానికి ఇది కొత్త కాదు..

రాజమహేంద్రవరంలో పులి సంచారం అనేది నగర ప్రజలకు కొత్త కాదు. 2008లో ఓ చిరుత పులి అటవీ ప్రాంతం నుంచి నగరానికి చేరుకుని లలితానగర్లో నివాసాల మధ్యకు వచ్చింది. అక్కడ కుక్కల తరుముతుండటంతో ఓ ఇంటి స్నానపు గదిలో దూరింది. అప్పటికే అలసిపోయి అది ఘాడ నిద్రకు చేరుకుంది. తెల్లవారు జామున గమనించిన ఆ ఇంటి మహిళలు స్నానపు గది తలుపు గడియ పెట్టి, విషయం పోలీసులకు చెప్పడంతో వారిచ్చిన సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని ఆ చిరుతపులిని బంధించారు. అదే విధంగా 2011లో ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ ఆవరణలో ఓ చిరుతపులి ప్రవేశించి ఓ వసతిగృహం ఆవరణలోని పెంపుడు కుక్కపై దాడికి ప్రయత్నించడంతో అక్కడ యజమానులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి బోనులు పెట్టి, ఎర వేసి కష్టపడి పట్టుకున్నారు. ఇదే విధంగా 2018లో ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని దట్టమైన వనంలోకి ప్రవేశించిన రెండు చిరుత పులులను అటవీ శాఖ అధికారులు బంధించారు. ఆ సమయంలోనే రాజమహేంద్రవరం కేంద్రకారాగారం ఆవరణలోని ఆరు బయట జైలు తోటల్లో నుంచి చిరుతపులి పరుగు పెడతూ బయటకు వెళ్లడంతో అక్కడే కాపలాగా ఉన్న సిబ్బంది చూసి ఆందోళనకు గురయ్యారు. తిరిగి ఆరేళ్ల తర్వాత గురువారం రాత్రి నగరంలో పులి సంచారం ఉందని చెప్పడం చర్చనీయాంశమైంది.

ఈ దారిలోంచే వచ్చేది

చిరుత పులులు అటవీ ప్రాంతంలో నుంచి మైదాన ప్రాంతాల వైపు వస్తుండటానికి కారణం ఆహార వేట. ఇందులో భాగంగా రాత్రి సమయంలో అవి దారితప్పి ఇష్టానుసారంగా వెళుతూ నగరాల్లోకి ప్రవేశిస్తున్నాయి. రాజమహేంద్రవరంలో కనిపించిన పులులన్నీ అడ్డతీగల వైపు నుంచి మల్లిసాల మీదుగా వస్తున్నవేనని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. లాలాచెరువు ప్రాంతంలో గురువారం కనబడింది చిరుత పులా కాదా అనేది నిర్ధారించే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అటవీ శాఖ అప్రమత్తం

రాజానగరం: లాలాచెరువు సమీపంలో చిరుతపులి సంచరించిందనే వార్తల నేపథ్యంలో అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇందులో నిజానిజాలను తెలుసుకునేందుకు శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. ఒకచోట అనుమానాస్పదంగా ఉన్న ఒక పెగ్ మార్క్‌ను చూసి, అది ఏ జంతువుకు సంబంధించినదనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. లాలాచెరువు పరిసరాలు, పుష్కర వనంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, చిరుతపులి సంచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని దివాన్‌చెరువు సెక్షన్ డీఆర్‌ఓ పద్మావతి తెలిపారు.

ఏమైందో ఏమో..

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

తాళ్లరేవు/ పెదపూడి: : ఏం జరిగిందో ఏమో.. ఆ ఇద్దరు యువకులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయతీ శివారు అడవిపూడి గ్రామంలో శుక్రవారం ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పెదపూడి మండలం ఏపీ త్రయం గ్రామానికి చెందిన గుర్రాని భవానీ కిశోర్ (22), పెస్సింగి ఇషాక్ (22)లు స్నేహితులు. వీరు అడవిపూడిలో ఓ కోళ్లఫారంలో కూలీలుగా పనిచేస్తున్నారు. కాగా గురువారం పనికి వచ్చిన ఇద్దరూ కోళ్లఫారంలో ఉరివేసుకుని విగతజీవులుగా కనిపించడంతో కోళ్లఫారం నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిశోర్ జీవితంపై విరక్తితో ఉరివేసుకుని మృతి చెందగా, అతన్ని చూసి చలించి స్నేహితుడైన ఇషాక్ కూడా మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఆ యువకుల మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ త్రయంలో విషాదఛాయలు

జీవనోపాధి నిమిత్తం వెళ్లిన తమ కుమారుల మరణవార్త తెలియగానే మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. పెదపూడి మండలం ఏపీ త్రయం గ్రామానికి చెందిన గుర్రాని భవానీ కిశోర్ 45 రోజులుగా అడవిపూడి ప్రాంతంలోని కోళ్లఫారంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 5న ఇదే గ్రామానికి చెందిన ఇషాక్ కూడా అతనితో కోళ్లఫారంలో పనికి వెళ్లాడు. కిశోర్ రోజూ ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. అలాగే 5న ఇద్దరూ వెళ్లి సాయంత్రం ఇంటికి రావాల్సి ఉండగా రాలేదు. వారి తల్లిదండ్రులు ఇంకా ఇంటికి రాలేదని ఆందోళన చెందుతున్న నేపథ్యంలో కిశోర్, ఇషాక్‌కు మృతి చెందారనే వార్త అందడంతో వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కిశోర్‌కు తల్లి అప్పయమ్మ, అక్క ఉన్నారు. ఇషాక్‌కు తల్లి ధనావతి, తండ్రి ధనకాసులు, అక్క, అన్న ఉన్నారు. అయితే ఈ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



భవానీ కిశోర్ (ఫైల్)



ఇషాక్ (ఫైల్)

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన మెర్ల సత్తియ్య (53) పురుగు మందు తాగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన అతను తరచూ ఇంట్లో గొడవ పడుతూ కుటుంబ సభ్యులను వేధిస్తుండేవాడు. గురువారం యథావిధిగా మద్యం తాగి ఇంటికి వచ్చిన సత్తియ్యను భార్య నిలదీయడంతో మనస్థాపం చెంది పురుగు మందు తాగాడు. వెంటనే అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు ఆత్రేయపురం ఎస్సై ఎస్.శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోతిలో పడి మోటారు సైకిలిస్టుకు తీవ్ర గాయాలు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డులో ఉన్న గోతిలో శుక్రవారం రాత్రి మోటారు సైకిలిస్టు పడి తీవ్రంగా గాయపడ్డాడు. వేట్లపాలెం నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న వ్యక్తి సుగర్ ఫ్యాక్టరీ క్వార్టర్స్ వద్ద గోతులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో స్థానికులు అతనిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అడుగడుగునా గోతులు పడింది. దాంతో ఈ రోడ్డులో కొత్త వ్యక్తులు ప్రయాణించే సమయంలో అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాల్సి ఉంది.



ప్రమాదంలో గాయపడిన మోటారు సైకిలిస్టు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	1,017	81,184
నిఫ్టీ ▽	293	24,852

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,709	▽ 418
డోజోన్స్	40,402	▽ 362
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,181	▽ 60
డాక్స్	18,302	▽ 275
షాంఘై	2,766	▽ 23
నికాయ్	36,657	▽ 266

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	71,329	△ 233
బంగారం (99.5 స్వచ్ఛత)	71,047	△ 235
వెండి (కేజీ)	81,406	△ 567

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	109.25	118.86
€	యూరో	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	57.81	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	62.23	66.94
SAR	సౌదీ రియాల్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	21.98	23.76
¥	చైనా యువాన్	10.97	12.79

సెప్టెంబర్ మాసం...

ఐపీఓల వర్షం!

ఈ నెలలో 15కు పైగా పబ్లిక్ ఇష్యూలు ● 2010 నాటి 14 ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యే చాన్స్...

వరుస ఐపీఓలతో సెప్టెంబర్ నెలలో స్టాక్ మార్కెట్ కళకళలాడనుంది. ఇప్పటికే గాలా ప్రెసిషన్ ఇంజనీరింగ్, బాజార్ స్టయిల్ రిటైల్ ఇష్యూలు పూర్తయ్యాయి. ఇంకా అనేక ఇష్యూలు నిధుల సమీకరణ బాటలో ఉన్నాయి. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, గరుడా కన్‌స్ట్రక్షన్స్, మన్బా ఫైనాన్స్ సహా అనేక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల మోత మోగించనున్నాయి. దీంతో 2010 సెప్టెంబర్ నెల 15 ఐపీఓల రికార్డు తుడిచిపెట్టుకుపోవచ్చనేది మార్కెట్ వర్గాల అంచనా. ఇన్వెస్టర్ల నుంచి పటిష్టమైన డిమాండ్‌కు సెకండరీ మార్కెట్లో నెలకొన్న ఉత్సాహం తోడవడంతో మరిన్ని కంపెనీలు ఐపీఓల బాట పట్టేందుకు దోహదం చేస్తోందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. 'వచ్చే కొన్ని వారాల్లో చాలా కంపెనీలు పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్నాయి. ఇటీవలి ఐపీఓలకు బలమైన డిమాండ్‌తో పాటు దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి నిధుల ప్రవాహం తగినంతగా ఉండటం కూడా దీనికి ప్రధాన కారణం'. మరోపక్క తాజా ఇష్యూలు లిస్టింగ్‌లోనూ, ఆ తర్వాత కూడా ఇన్వెస్టర్లకు మంచి లాభాలు పంచడం మార్కెట్లో మరింత జోష్ నింపుతోంది' అని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఎండీ వి. జయశంకర్ పేర్కొన్నారు.

> స్టాక్ మార్కెట్ జోరు నేపథ్యంలో పబ్లిక్ ఆఫర్లు (ఐపీఓ) వెల్లువెత్తుతున్నాయి. సెప్టెంబర్ నెలలో ఇష్యూల వర్షం కురవనుంది. 2010 సెప్టెంబర్‌లో అత్యధికంగా 15 ఐపీఓలతో రికార్డు నమోదైంది. ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్లో జోరు చూస్తుంటే ఈ ఏడాది ఆ 14 ఏళ్ల రికార్డు బద్దలయ్యే అవకాశం కనిపిస్తోంది.

విదేశీ పోర్ట్‌ఫోలియో నిధుల వెల్లువ...

ఈ ఏడాది ఇప్పటిదాకా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.55,300 కోట్ల నిధులను ఐపీఓల్లో కుమ్మరించారు. మరోపక్క, సెకండరీ మార్కెట్లో రూ.2,700 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. రూ. 6,560 కోట్ల బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ భారీ ఇష్యూ 9న మొదలవుతోంది. దీని ప్రైస్ బ్యాండ్ రూ.66-70. టోలిన్స్ టైర్స్ రూ.230 కోట్ల నిధుల కోసం 9న మార్కెట్ తలుపుతడుతోంది. ఇక పీఎన్ గాడ్గిల్ జ్యువెల్లర్స్ రూ.228-240 ధరల శ్రేణితో ఈ నెల 10న ఐపీఓకు వస్తోంది. గతేడాది సెప్టెంబర్లో వచ్చిన రూ.11,893 కోట్ల విలువైన 14 ఐపీఓలే ఇటీవలి కాలంలో అత్యధికంగా నిలుస్తున్నాయి. 2024 ఆగస్టులో 10 కంపెనీలు రూ.17,076 కోట్ల నిధులను సమీకరించాయి. 'మెరుగైన వ్యాపారావకాశాల నేపథ్యంలో భారత కార్పొరేట్ సంస్థలు ప్లాంట్ల విస్తరణతో పాటు కంపెనీల కొనుగోళ్ల జోరు పెంచాయి. మరో పక్క, పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ఆడిట్ చేసిన ఆర్థిక ఫలితాల గడువు ఆరు నెలలు మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్నెల్ల గడువు సెప్టెంబర్‌తో ముగియనుంది. ఈలోపు ఐపీఓ పూర్తి చేయక పోతే, మళ్లీ ఆడిట్ చేయడంతో పాటు ఐపీవో ముసాయిదా దరఖాస్తు పత్రాలను మార్చాల్సి ఉంటుంది. దీని వల్ల ఇష్యూ జాప్యానికి దారితీస్తుంది. అందుకే కంపెనీలు వరుసకడుతున్నాయి' అని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ రవి శంకర్ చెప్పారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



ఎగబడుతున్న ఇన్వెస్టర్లు..


లిస్టింగ్‌లో అసాధారణ లాభాలిస్తుండటంతో ఇటీవలి కాలంలో మార్కెట్లోకి ఏ ఐపీఓ వచ్చినా రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడిపోతున్నారు. ఈ నెల 4న ముగిసిన రూ.168 కోట్ల గాలా ప్రెసిషన్ ఇష్యూ 201 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయింది. బాజార్ స్టయిల్‌కు 41 రెట్ల స్పందన లభించింది. అంతక్రితం ఎకోస్ మొబిలిటీకి 64 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. అంతేకాదు, ఇది 32 శాతం ప్రీమియంతో లిస్టయింది కూడా. ప్రీమియర్ ఎనర్జీస్ 87 శాతం, ఓరియంట్ టెక్నాలజీస్ 48 శాతం చొప్పున లిస్టింగ్ లాభాలను పంచాయి. ఆగస్టులో లిస్టయిన 8 ఐపీఓల సగటు లాభం 36 శాతం కావడం గమనార్హం.

క్యూలో ఉన్న ఐపీఓలు...

కంపెనీ	సమీకరణ (రూ. కోట్లలో)
ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా	7,000
బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్	6,560
నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్	3,000
పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్	1,100
క్రాస్ లిమిటెడ్	500
వెస్టర్న్ క్యారియర్స్	*500
నార్తర్న్ ఆర్క్	*500
ఆర్కేడ్ డెవలపర్స్	430
శివాలిక్ ఇంజనీరింగ్	*335
టోలిన్స్ టైర్స్	230
శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో	170
డిఫ్యూజన్ ఇంజనీర్స్	150

* ఆఫర్ ఫర్ సేల్ అదనం.

డీమ్యాట్ ఖాతాలు రయ్.. రయ్!



మార్కెట్ రికార్డులు, ఐపీఓల వరదతో కొత్తగా ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆగస్టులో 41.4 లక్షల డీమ్యాట్ ఖాతాలు జత కావడంతో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 17.1 కోట్లకు దూసుకెళ్లింది. ఇది ఆల్‌టైమ్ రికార్డు.

ఈవీ రంగంలోకి

రిలయన్స్ ఇన్‌ఫ్రా

కన్సల్టెంట్‌గా బీవైడీ మాజీ చీఫ్ సంజయ్ నియామకం



న్యూఢిల్లీ: అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా ఎలక్ట్రిక్ కార్లు (ఈవీ), బ్యాటరీల తయారీ విభాగంలోకి ప్రవేశించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రణాళికలకు సంబంధించి వ్యయాలపరంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు చైనా దిగ్గజం బీవైడీ ఇండియా మాజీ హెడ్ సంజయ్ గోపాలకృష్ణన్‌ను కన్సల్టెంటుగా నియమించుకున్నట్లు సమాచారం. రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రాథమికంగా ఏటా 2,50,000 ఈవీలతో మొదలుపెట్టి 7,50,000 వాహనాలకు ఉత్పత్తిని పెంచుకోవాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే 10 గిగావాట్ అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో బ్యాటరీల తయారీ ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు వివరించాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం రిలయన్స్ ఇన్‌ఫ్రా జూన్‌లోనే వాహన రంగానికి సంబంధించి కొత్తగా రెండు అనుబంధ సంస్థలను ప్రారంభించింది. రిలయన్స్ ఈవీ ప్రైవేట్ లిమిటెడ్ వీటిలో ఒకటి. అధిక రుణభారం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కంపెనీ ఈ కొత్త ఈవీ ప్రాజెక్టులకు నిధులెలా సమకూర్చుకుంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బ్యాంకుల్లో అప్రెంటిస్‌లుగా గ్రాడ్యుయేట్లకు చాన్స్! | వొడాఫోన్‌కు గోల్డ్‌మన్ శాక్స్ షాక్

రెండు వారాల కనిష్టానికి సెన్సెక్స్

- 24,900 స్థాయి దిగువకు నిఫ్టీ
- అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలకు తోడు దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ రెండు వారాల కనిష్టానికి చేరుకోగా.., నిఫ్టీ 24,900 స్థాయిని కోల్పోయింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 82,171 వద్ద, నిఫ్టీ 25,094 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,219 పాయింట్లు క్షీణించి 80,981 వద్ద, నిఫ్టీ 344 పాయింట్లు కుప్పకూలి 24801 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 1,017 పాయింట్లు నష్టపోయి 81,184 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 293 పాయింట్లు పతనమై 24,852 వద్ద నిలిచింది.

నష్టాలు ఎందుకంటే...

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే నిరుద్యోగ రేటు, నాన్‌ఫారం పేరోల్స్ డేటా వెల్లడి (శుక్రవారం రాత్రి)కి ముందు నెలకొన్న అప్రమత్తతతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మూడు వారాల కనిష్ఠ స్థాయి వద్ద ట్రేడవుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ అంతిమ లబ్ధిదారుల వివరాలు తెలిపేందుకు సెబీ తుది గడువు సెప్టెంబర్ 9న కావడంతో దేశీయ మార్కెట్లో ఎఫ్ఐఐలు అమ్మకాలకు పాల్పడుతున్నారు.

- ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ శుక్రవారం ఒక్కరోజే రూ.5.49 లక్షల కోట్లు హరించుకుపోయాయి. దీంతో బీఎస్‌ఈలో మార్కెట్ విలువ రూ.460.18 లక్షల కోట్లు దిగివచ్చింది.
- బజార్ స్టైల్ రిటైల్ లిస్టింగ్ రోజు నామమాత్రపు లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.389 వద్ద లిస్టయ్యింది. నష్టాల మార్కెట్లోనూ ఎదురీదడంతో షేరు ఇంట్రాడేలో 11% పెరిగి రూ.431 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో 3% స్వల్ప లాభంతో రూ.400 వద్ద నిలిచింది.

స్విగ్గీలో 'సీక్రెట్' ఆర్డర్




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ కంపెనీ స్విగ్గీ పరిశ్రమలో తొలిసారిగా వినూత్న ఫీచర్‌ను పరిచయం చేసింది. ఫుడ్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఇన్‌కాగ్నిటో మోడ్ ద్వారా వినియోగదార్లు ప్రైవేటుగా ఆర్డర్ చేయవచ్చు. అంటే ఆర్డర్ వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంటాయి. ఇన్‌కాగ్నిటో మోడ్ యాక్టివేట్ చేస్తే చాలు. యాప్ హిస్టరీలో ఆర్డర్ వివరాలు ఎక్కడా కనిపించవు. ఆర్డర్ వివరాలను మాన్యువల్‌గా డిలీట్ చేసే అవసరం లేదని కంపెనీ చెబుతోంది. ఆర్డర్ తాలూకు ఉత్పత్తులు డెలివరీ అయ్యాక ఏవైనా సమస్యలు ఉంటే మూడు గంటలపాటు ట్రాక్ చేసేందుకు వీలు ఉంటుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌కు బోనస్ జోష్

2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి సై

న్యూఢిల్లీ: సిగరెట్ల తయారీ దిగ్గజం గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా తాజాగా వాటాదారులకు బోనస్ షేర్లను ప్రకటించింది. 2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి ప్రతిపాదించింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు కంపెనీ బోర్డు సెప్టెంబర్ 20న సమావేశంకానున్నట్లు వెల్లడించింది. వెరసి వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకి 2 షేర్లను ఉచితంగా జారీ చేయనుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేరు 13 శాతం దూసుకెళ్లి రూ. 7,204 వద్ద ముగిసింది.





ఇంటర్‌కాంటినెంటల్ కప్: సిరియా ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో సిరియా 2-0తో మారిషస్‌పై ఘన విజయం సాధించింది. ఈ పరాజయంతో మారిషస్ టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ కాగా... సోమవారం జరిగే ఆఖరి పోరులో ఆతిథ్య భారత్‌తో సిరియా తలపడుతుంది. జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సిరియా ఫుట్‌బాలర్లు ఆరంభం నుంచే మ్యాచ్‌పై పట్టు సంపాదించారు. పదేపదే ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా దాడులకు పదునుపెట్టారు. కానీ ప్రత్యర్థి డిఫెండర్ బ్రెండన్ సిటొరా చేసిన తప్పిదంతో సిరియా ఖాతా తెరిచింది. ఆట 32వ నిమిషంలో సిటొరా సెల్ఫ్‌గోల్‌తో సిరియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత రెండో అర్ధభాగంలో అల్ మవాస్ (70వ నిమిషంలో) సాధించిన గోల్‌తో సిరియా ఆధిక్యం (2-0) రెట్టింపైంది. మరోవైపు మారిషస్ కూడా రెండో సగంలో గోల్ కోసం చేసిన ప్రయత్నాల్ని సిరియా డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు.

ప్రవీణ్ 'పసిడి' వెలుగులు

హైజంప్‌లో స్వర్ణం సాధించిన అథ్లెట్

- భారత్ ఖాతాలో ఆరో స్వర్ణం
- పారిస్ పారాలింపిక్స్ క్రీడలు

టోక్యోలో జరిగిన గత పారాలింపిక్స్ క్రీడల్లో భారత ఆటగాళ్లు ఐదు స్వర్ణాలు సాధించారు. ఇప్పుడు దానిని మన బృందం అధిగమించింది. 21 ఏళ్ల భారత అథ్లెట్ ప్రవీణ్ కుమార్ దేశానికి ఆరో పసిడి పతకాన్ని అందించాడు. హైజంప్‌లో అతను ఈ మెడల్‌ను గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత్‌కు స్వర్ణానందం దక్కగా.. ఇతర ఈవెంట్లలో మాత్రం నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి.



ప్రవీణ్

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకంతో సత్తా చాటిన భారత హైజంపర్ ప్రవీణ్ కుమార్ ఈ సారి మరింత బలంగా పైకి లేచాడు. తన ప్రదర్శనను మెరుగుపర్చుకుంటూ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల హైజంప్ – టి64 ఈవెంట్‌లో ప్రవీణ్‌కు స్వర్ణ పతకం దక్కింది. 2.08 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఆసియా రికార్డుతో అతను పసిడిని గెలుచుకున్నాడు. అమెరికాకు చెందిన డెరెక్ లాసిడెంట్ (2.06 మీ.) రజతం గెలుచుకోగా, తెమూర్‌బెక్ గియాజోవ్ (ఉజ్బెకిస్తాన్ – 2.03 మీ.)కు కాంస్యం దక్కింది. ముందుగా 1.89 మీటర్ల ఎత్తుతో మొదలు పెట్టిన ప్రవీణ్ తన ఏడో ప్రయత్నంలో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. పారిస్ పారాలింపిక్స్‌లో శరద్ కుమార్, మరియప్పన్ తంగవేలు తర్వాత భారత్ తరఫున హైజంప్‌లో పతకం సాధించిన మూడో అథ్లెట్‌గా ప్రవీణ్ నిలిచాడు.

కస్తూరికి ఎనిమిదో స్థానం...

మహిళల పవర్‌లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో భారత ప్లేయర్ కస్తూరి రాజమణికి నిరాశ ఎదురైంది. మూడు ప్రయత్నాల్లో రెండు ఫౌల్స్ కాగా, అత్యుత్తమంగా 106 కిలోల బరువు మాత్రమే ఎత్తిన కస్తూరి ఎనిమిదో స్థానంతో ముగించింది. మహిళల కనోయింగ్ 'వా' సింగిల్ 200 మీ. హీట్స్‌లో రాణించిన ప్రాచీ యాదవ్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. కనోయింగ్ 'కయాక్' సింగిల్ 200 మీ. కూడా భారత ప్లేయర్ పూజ ఓఝా సెమీస్‌కు చేరింది. పురుషుల 'కయాక్' సింగిల్ 200 మీ.లో యష్ కుమార్ కూడా సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. పురుషుల జావెలిన్ త్రో – ఎఫ్ 54 కేటగిరీలో భారత అథ్లెట్ దీపేశ్ కుమార్ అందరికంటే చివరగా ఏడో స్థానంతో ముగించాడు. అతను జావెలిన్‌ను 26.11 మీటర్ల దూరం విసిరాడు. పురుషుల 400 మీ. – టి47 ఈవెంట్ తొలి రౌండ్ హీట్స్‌లో మూడో స్థానంతో నిలిచి దిలీప్ గవిట్ ముందంజ వేశాడు. మహిళల 200 మీ.–టి12 పరుగు సెమీ ఫైనల్లో రాణించిన సిమ్రన్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మహిళల జావెలిన్ త్రో –ఎఫ్ 46లో భావనాబెన్ చౌదరి 39.70 మీటర్లు జావెలిన్‌ను విసిరి ఐదో స్థానంలో నిలిచింది.

బరిలోకి దిగితే పతకం ఖాయమే!



ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ పుట్టుకతోనే వికలాంగుడు. అతని ఎడమ కాలు పూర్తిగా ఎదగకుండా చిన్నగా ఉండిపోయింది. చిన్నతనంలో కొందరు హేళన చేయడం అతడిని తీవ్రంగా బాధపెట్టేది. దీనిని మర్చిపోయేందుకు అతను ఆటలపై దృష్టి పెట్టాడు. వైకల్యం ఉన్నా సరే దానిని పట్టించుకోకుండా మిత్రులతో కలిసి వాలీబాల్ ఆడేవాడు. అయితే అనూహ్యంగా ఒక సారి సాధారణ అథ్లెట్లు పాల్గొనే హైజంప్‌లో అతనికీ అవకాశం దక్కింది. దాంతో అథ్లెటిక్స్‌తో తనకు మరిన్ని అవకాశాలు ఉన్నాయని ప్రవీణ్‌కు అర్థమైంది. సత్యపాల్ సింగ్ అనే పారా అథ్లెటిక్స్ కోచ్ అతనిలో ప్రతిభను గుర్తించి హైజంప్‌పై పూర్తిగా దృష్టి పెట్టేలా చేశాడు. అన్ని రకాలుగా ప్రవీణ్‌ను తీర్చిదిద్దాడు. అనంతరం పారా క్రీడల్లో పాల్గొంటూ అతను వరుస విజయాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో రజతం, ఇప్పుడు స్వర్ణంలతో పాటు ప్రవీణ్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఒక రజతం, ఒక కాంస్యం కూడా గెలిచాడు. పారిస్ క్రీడలకు ముందు గజ్జల్లో గాయంతో బాధపడిన అతను సరైన సమయానికి కోలుకొని సత్తా చాటాడు.




దీప్తికి ఘన స్వాగతం

పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం గెలుచుకున్న తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజి హైదరాబాద్‌కు చేరుకుంది. శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు క్రీడాకారులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) అధికారులు ఘనస్వాగతం పలికారు. పారాలింపిక్స్ 400 మీ. (టి20) పరుగులో దీప్తి కాంస్యం సాధించింది. విమానాశ్రయంలో ఆమె వెంట అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, 'శాట్స్' చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫైనల్లో జెస్సికా, సబలెంకా

- సెమీస్‌లో ఓడిన ముచొవా, నవారో
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్


సబలెంక


జెస్సికా

న్యూయార్క్: అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగులా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో తొలిసారి సెమీస్ చేరిన ఆమె తన ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకుంటూ ఈ సారి సొంతగడ్డపై యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరింది. భారత కాలమాన ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆరో సీడ్ జెస్సికా 1-6, 6-4, 6-2తో కరోలినా ముచొవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. అయితే మరో అమెరికన్ ఎమ్మా నవారో ఆట సెమీస్‌తోనే ముగిసింది. రష్యన్ స్టార్, గత యూఎస్ ఓపెన్ రన్నరప్ అరినా సబలెంక 6-3, 7-6 (7/2)తో 13వ సీడ్ ఎమ్మా నవారోను వరుస సెట్లలో ఇంటిదారి పట్టించింది. నేడు జరిగే ఫైనల్లో పెగులా తన తొలి గ్రాండ్‌స్లామ్ కోసం, సబలెంక తన మూడో గ్రాండ్‌స్లామ్ కోసం తలపడతారు. సబలెంకా 2023, 2024లలో వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గింది.

తొలి సెట్ కోల్పోయినా...

క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించిన జెస్సికాకు సెమీస్ పోరు అంత సులువుగా సాగలేదు. మ్యాచ్ ఆరంభంలో ఫ్రెంచ్ ఓపెన్ 2023 రన్నరప్, చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ముచొవా చెలరేగి ఆడింది. తొలి 12 విన్నర్లలో పది విన్నర్లను ఆమె కొట్టింది. తొలి సెట్‌లో పెగులా అదేపనిగా చేసిన తప్పిదాలు, పేలవమైన సర్వీస్‌తో వెనుకబడింది. ఇదే అదనుగా పట్టు బిగించిన ముచొవా 28 నిమిషాల్లోనే తొలి సెట్‌ను వశం చేసుకుంది. రెండో సెట్‌లోనూ తొలి 9 గేముల్లో ఎనిమిదింట గెలిచి ఒక దశలో 3-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఇక్కడి నుంచి సీన్ మారిపోయింది. జెస్సికా జోరు మొదలైంది. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆటలో వేగం పెంచింది. మూడు బ్రేక్ పాయింట్లతో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్లో చెక్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా జెస్సికా మెరుపు షాట్లతో విరుచుకుపడింది.

సబలెంక జోరు

మరో సెమీఫైనల్లో రష్యన్ స్టార్ సబలెంక జోరుకు ఎమ్మా నవారో ఎదురు నిలువలేకపోయింది. ప్రత్యేకించి యూఎస్ ఓపెన్‌లో తొలిరౌండే దాటని అమెరికన్ ప్లేయర్ ఎమ్మా నిరుటి రన్నరప్ సబలెంక ధాటికి తొలిసెట్‌లో చతికిలబడింది. తొలిసెట్‌ను 6-3తో గెలుచుకున్న రెండో సీడ్ సబలెంకకు రెండో సెట్‌లో కాస్తా పోటీ ఇవ్వడంతో ఈ సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. అయితే టై బ్రేక్‌లో అనుభవజ్ఞురాలైన రష్యన్ అలవోకగా పాయింట్లు సాధించడంతో కేవలం గంటన్నరలోనే మ్యాచ్ ముగిసింది. సబలెంక 8 ఏస్‌లతో చెలరేగింది. 34 విన్నర్లు కొట్టింది. ఒకే ఒక ఏస్ సంధించిన నవారో 13 విన్నర్లే కొట్టగలిగింది.